నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శుక్రవారం 7 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI


## ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ



ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 6 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 29 సెంటర్లను ఏర్పాటు చేశారు. తొలిరోజు 5,690 మంది విద్యార్థులకు గానూ 5,515 మంది హాజరు కాగా 175 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విభాగంలో 82 మంది, ఒకేషనల్ విభాగంలో 93 మంది విద్యార్థులు రాలేదని ఇంటర్ నోడల్ ఆఫీసర్ రమణి తెలిపారు.

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్టతోపాటు ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, మెడికల్ సిబ్బంది పనితీరును పరిశీలించారు.

# కాళేశ్వరంపై కక్ష.. అన్నదాతకు శిక్ష

## సూర్యాపేట జిల్లాలో కష్టనష్టాల ఎవుసం

## ఇప్పటికే 30వేల ఎకరాల్లో ఎండిన వరి

### నీళ్లందకపోతే పంట నష్టం మరో లక్ష ఎకరాలకు చేరే ప్రమాదం

- అన్నదాత నోట్లో మట్టి కొడుతున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్రస్థాయిలో భగ్గుమంటున్న రైతాంగం
- ఈ యాసంగిలో సాగుకు నోచని భూమి పాతిక వేల ఎకరాలకుపైనే..



నీటి ఎద్దడి కారణంగా రైతు వీరబోయిన సతీశ్ ఆత్మకూర్.ఎస్ పరిధిలోని కాచిగూడ సబ్‌స్టేషన్ దగ్గర జీవాల మేతకు వదిలిపెట్టిన పొలమిదే

సూర్యాపేట, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : తరాల తరబడి సాగునీటికి నోచని బీడు భూములు, వలస జీవితాలతో అల్లాడిన సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేసింది కాళేశ్వరం ప్రాజెక్టు. గత బీఆర్ఎస్ సర్కారులో పుష్కలంగా గోదావరి జలాలు అందడంతో బీళ్లన్నీ క్రమంగా పంట భూములుగా మారి సిరులు పండించాయి. కాళేశ్వరం జలాల ద్వారా ఎస్సారెస్పీ కాల్వల పరిధిలో 2.50 లక్షల ఎకరాలు, చెరువులు, కుంటల ఆధారంగా మరో 45వేల ఎకరాల ఆయకట్టులో వరి సాగు అయ్యింది. కానీ, ఈ కాంగ్రెస్ పాలనలో మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలో దుర్భర పరిస్థితులు దాపురించాయి. పంటలకు నీళ్లు లేక వేల ఎకరాల్లో వరి చేలు నెర్రెల వారాయి. భగ్గుమంటున్న ఎండలకు పంట లు మాడి పశువులకు మేతగా మారుతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చిన పంట పొట్ట దశలో కండ్ల ముందు ఎండిపోతుంటే కాపాడుకునేందుకు సాగు నీరు లేక, సర్కారు కణికరించక రైతాంగం తల్లడిల్లుతున్నది.

కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న సాకును చూపి కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టి సూర్యాపేట జిల్లా రైతుల నోట్లో మట్టి కొడుతున్నది. ఈ యాసంగి సీజన్ ప్రారంభంలో కాల్వల్లో నీటి ప్రవాహం తక్కువగా ఉండడం చూసి కాళేశ్వరం జలాల ఆధారంగా సాగయ్యే ఆయకట్టులో చివరి భూముల రైతులు దాదాపు 25వేల ఎకరాల్లో నాట్లు వేయలేదు. నాటిన పంటలు సైతం నెల గడవకు ముందు నుంచే నీళ్లు చాలక ఎండు ముఖం పట్టాయి. గత 40 రోజుల్లో దాదాపు 30 వేల ఎకరాల్లో వరి పైర్లు ఎండిపోయాయి. ఎండిన పంటలను రైతులు పశువులు, జీవాల మేతకు వదిలి పెడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే నెల రోజుల్లో మరో లక్ష ఎకరాలకు పైగా వరి ఎండిపోవడం ఖాయమని రైతులు చెప్తున్నారు.

తెలంగాణలోని సాగు కష్టాలను చాలా దగ్గరగా చూసిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాటి బీఆర్ఎస్ సర్కారులో రైతాంగానికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చారు. పుష్కలంగా సాగునీరు, ఉచితంగా నిరంతర విద్యుత్ అందించడం, అందుబాటులో ఎరువులు, నాణ్యమైన విత్తనాలను ఉంచడంతోపాటు సీజన్ ప్రారంభానికి ముందే పంటకు పెట్టుబడి రైతు బంధు సాయం అందజేశారు. దాంతో బీడు భూములు సైతం సాగులోకి వచ్చాయి. గతంలో వలస వెళ్లిన రైతు కుటుంబాలు తిరిగి సొంతూళ్లకు వచ్చి పొలం బాట పట్టాయి. కేసీఆర్ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఏడేండ్లపాటు రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించారు. మండు వేసవిలోనూ వంద శాతం చెరువులను నింపి అలుగు దుంకించడంతో కరువ ఛాయలు అన్నవే కనిపించ లేదు.

### ఒక రైతు ఆవేదన



ఎస్సారెస్పీ కాల్వ వద్ద రైతు లక్ష్మయ్య

చివ్వెంల : చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన ఈ రైతు పేరు గోనెల లక్ష్మయ్య. ఏడెకరాల్లో వరి సాగు చేశాడు. నీళ్లు లేక ఇప్పటికే నాలుగెకరాల్లో పంట ఎండిపోయింది. మిగిలిన పంటనైనా కాపాడుకుందామంటే పొలంలో ఉన్న ఒక్క బోరు ఆగి ఆగి పోస్తున్నది. నిన్న కాల్వకు నీళ్లు వదిలారని తెలిసి ఊరు శివారులోని ఎస్సారెస్పీ కాల్వ దగ్గరికి వచ్చాడు. సన్నగా వస్తున్న నీళ్ల చూసి ఆవేదన వ్యక్తం చేశాడు. కాల్వలో నీళ్లు కిలోమీటర్ పొడవు పారడానికి ఒకరోజు పడుతుందని, ఇలా వస్తే పొలాలకు ఎప్పుడు అందాలని మదన పడ్డాడు. కేసీఆర్ సర్కారులో వరి కోతలు అయిన నెల రోజులకు కూడా కాల్వలో నీళ్లు పారేవని చెప్పుకొచ్చాడు. ఇంతటి దుర్భర పరిస్థితులు వస్తాయని అనుకోలేదని లక్ష్మయ్య విచారం వ్యక్తం చేశాడు.

### కాంగ్రెస్ రాకతో కష్టాలు షురూ

అలివికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తొలి యాసంగినే ఎండబెట్టింది. నిర్లక్ష్యం, నీటి నిర్వహణ లోపం కారణంగా సూర్యాపేట జిల్లాలో లక్షల ఎకరాల్లో రైతులకు పంట నష్టం వాటిల్లింది. అదే పరిస్థితి రెండో యాసంగి అయిన ప్రస్తుత సీజన్‌లోనూ కనిపిస్తున్నది. చిన్న సాకును చూపించి గోదావరి జలాలను పారించే కాళేశ్వరం ప్రాజెక్టును పండ బెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం కరువు కోరల్లోకి రైతులను నెట్టింది. గత సీజన్‌లో నీటి అవస్థలను చూసిన రైతులు పాతిక వేల ఎకరాల్లో వరి నాటు వేయలేదు. వాళ్లు భయపడ్డట్టే ప్రస్తుతం ఎస్సారెస్పీ కాల్వల నీళ్లు అందక సూర్యాపేట, తుంగుతుర్తి, కోదాడ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 30 వేల ఎకరాల్లో వరి ఎండింది. చెరువులు ఎండిపోవడంతో భూగర్భజలాలు తగ్గి బోర్లు కూడా పోయడం లేదు. దాంతో మిగిలిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల వేల రూపాయలు ఖర్చు చేసి ట్యాంకర్లతో నీళ్లు పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్సారెస్పీ కాల్వలకు సాగు అవసరాలను బట్టి 1,800 నుంచి 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దాంతో ఎక్కడా నీళ్లకు ఇబ్బంది రాలేదు. చెరువులను నిండా నింపడం కూడా వ్యవసాయానికి కలిసి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ సీజన్‌లో 500 క్యూసెక్కులతో మొదలు పెట్టి వెయ్యి క్యూసెక్కులను వారబందీ షెడ్యూల్‌లో విడుదల చేస్తున్నది. దాంతో కొంతమేర మాత్రమే నీళ్లు పారుతున్నాయి. వేల ఎకరాలకు నీళ్లు అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టింపులు మాని కాళేశ్వరం పంపులను ఆన్ చేసి ప్రస్తుతం వస్తున్న ఎస్సారెస్పీ జలాలను పెంచకపోతే జిల్లాలో భారీ పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అప్పులే మిగిలినయ్



ఆత్మకూర్.ఎస్ మండలం కేంద్రం పరిధిలోని కాచిగూడ సబ్ స్టేషన్ దగ్గర నాకున్న తొమ్మిదెకరాల్లో వరి సాగు చేశాను. ఎస్సారెస్పీ కాల్వల నుంచి నీళ్లు రాకపోవడంతోపొట్ట దశలో పొలం అంతా ఎండిపోయింది. దాంతో గుండుగుత్తగా 18 వేల రూపాయలకు గొర్ల మేతకు ఇచ్చాను. నీళ్లు అంది పంట పండింతే ఎకరాకు 40 వేల రూపాయల వరకు వచ్చేవి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీళ్లకు ఢోకా ఉండేది కాదు. పంటలు ఎండింది లేదు. పంట పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

*- వీరబోయిన సతీశ్, రైతు, ఏపూరు గ్రామం (ఆత్మకూర్.ఎస్ మండలం)*

### నీళ్లు ఇవ్వలేమని చెప్తే వేరే పంటలైనా వేసుకునే వాళ్లం



గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సారెస్పీ కాల్వ ద్వారా పుష్కలంగా నీళ్లు వచ్చేవి. ఈసారి కూడా అలాగే నీళ్లు వస్తాయి అని నమ్మి నాకున్న ఎకరన్నర భూమితోపాటు మరో రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని వరి నాటు పెట్టాను. నీళ్లు రాకపోవడంతో రెండున్నర ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి గొడుతున్నది. ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్లు ఇవ్వలేమని చెప్తే వేరే పంటలు వేసుకునే వాళ్లం. ఇప్పుడు పంట పెట్టుబడికి తెచ్చిన అప్పులను తలుచుకుంటే నిద్ర పడతలేదు. ప్రభుత్వం ఎస్సారెస్పీ కాల్వల ద్వారా అందిస్తే కనీసం తాగునీరు అయినా దొరుకుతుంది. లేకపోతే జనంతోపాటు పశువులకు కూడా నీళ్లు దొరకవు. మా ఊరి చెరువు పూర్తిగా ఎండిపోయింది.

*-బోడ శ్రీను, రైతు, బీక్యాతండా(మోతె మండలం)*

### ఐదెకరాల వరి పశువుల పాలు



ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఐదెకరాల్లో వరి పంట వేశాను. ఇప్పుడు నీళ్లు లేక పంట మొత్తం ఎండి పశువుల పాలైంది. కేసీఆర్ పాలనలో రెండు పంటలకు కాళేశ్వరం నీళ్లు ఇచ్చేవారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి కష్టాలు కొని తెచ్చుకున్నట్లు అయ్యింది.

*-వీరబోయిన నాగయ్య, రైతు (తుంగతుర్తి)*

## గోవర్ధనగిరిధారిగా.. యోగానందుడిగా..

- భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహస్వామి
- గుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



గోవర్ధనగిరిధారి అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

యాదగిరిగుట్ట, మార్చి 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారు గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చారు. కుడిచేతిలో పిల్లనగ్రోవి, ఎడమచేతి చిటికెన వేలిపై గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రధానాలయ తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పు మాఢవీధుల్లో ప్రత్యేక మండపంపై స్వామివారిని అధిష్ఠించారు. దివ్య ప్రబంధంలోని అలంకార వైభవ ప్రాశురాలను పఠిస్తూ స్వామివారి విశిష్టతను ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు వివరించారు. రాత్రి స్వామివారికి దివ్య వాహన సేవ కొనసాగింది. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు నరసింహస్వామిగా అవతరించిన స్వామివారు.. రాత్రి సింహవాహనంపై యోగానంద నరసింహస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. రుత్వికుల పారాయణాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రధానాలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, ముఖ్య అర్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞీకులు, రుత్వికులు, అధికారులు పాల్గొన్నారు.

### నేడు ఎదుర్కోలు

లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం జగన్మోహిని అలంకారంలో స్వామివారు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ఊరేగించి, 8 గంటలకు ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించనున్నారు.



గుండాల మండలం పాచిల్ల గ్రామంలో ఎండిపోయిన పొలంలో గొర్రెలు మేపుతున్న రైతుతో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

## కాళేశ్వరం జలాలు ఇవ్వకనే ఎండుతున్న పంటలు

- ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి ఏం చేస్తున్నారు?
- బీర్ల అయిలయ్య.. నీళ్ల అయిలయ్య అని చెప్పుకోవడానికి సిగ్గుండాలి
- తక్షణమే సాగునీరు అందించాలి
- ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి
- గుండాలలో ఎండిన పంటలను పరిశీలించిన గొంగిడి మహేందర్‌రెడ్డి

గుండాల, మార్చి 6 : రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం జలాలు ఇవ్వక పోవడం వల్లే పంటలు ఎండిపోతున్నాయని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పాచిల్ల గ్రామంలో ఎండిన వరి పైర్లను గురువారం ఆయన పరిశీలించారు. ఎండిన పొలంలో గొర్రెలను మేపుతున్న రైతుతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు విడుదల చేయకపోవడం వల్ల భూగర్భ జలాలు గణనీయంగా తగ్గి బోర్లు, బావుల్లో నీళ్లు లేక దుర్భర పరిస్థితులు దాపురించాయన్నారు. రైతులు సాగునీరు, నాణ్యమైన కరెంటు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి చోద్యం చూస్తున్నారే తప్ప సాగునీరు అందించాలన్న ఆలోచన ఏమాత్రమూ లేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఈ మధ్య నీళ్ల అయిలయ్య అని పిలిపించుకుంటున్నారని, అలా చెప్పించుకోవడానికి సిగ్గు ఉండాలని దుయ్యబట్టారు. ఆయనకు రియల్ ఎస్టేట్ దందాలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదన్నారు. దమ్ముంటే రైతుల దగ్గరకు వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి పాలనను చూసి కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేశామా అని రైతులు, ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మచ్చ చెన్నారెడ్డి, అన్‌రెడ్డి రంగారెడ్డి, వీరమల్ల సోమన్న, నర్సిరెడ్డి, బందెల ప్రమోద్, జటంగి నాగరాజు, వంగూరి అనిల్, కందుకూరి చందు పాల్గొన్నారు.

# బిక్కేరుకు నీళ్లివ్వండి సారూ!

## అడ్డగూడూరులో వందల ఎకరాల్లో దెబ్బతింటున్న వరి

**చేతికి వచ్చే దశలో నీళ్లు లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అడ్డగూడూరు మండలం బిక్కేరు వాగు ఆధారంగా వరి సాగు చేసిన రైతులు ఇప్పుడు నీళ్లు లేక అల్లాడుతున్నారు. కండ్ల ముందు ఎండిపోతున్న పంటలను చూసి కణికరం చూపని సర్కారుపై పోరాటానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే వందల ఎకరాల్లో వరి ఎండిపోగా, మిగిలిన కొద్దిపాటి పంటనైనా కాపాడుకునేందుకు వారం పది రోజులు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.**

*– యాదాద్రి భువనగిరి, మార్చి 6 (నమస్తే తెలంగాణ)*

- తొలిసారి వాగు వెంట ఎండిన పంటలు
- 10 రోజులు నీళ్లిస్తేనే పంటలు బతికే అవకాశం
- సాగునీటి కోసం ఆందోళన బాట పడుతున్న రైతులు



అడ్డగూడూరు మండలం జానకిపురంలో బిక్కేరు వాగు పక్కన ఎండిపోయిన పొలాలు

గంధమల్ల రిజర్వాయర్ నుంచి కాళేశ్వరం జలాల విడుదలతో బిక్కేరు వాగు ప్రవహిస్తుంది. ఇది ఆత్మకూరు, మోత్కూరు మీదుగా అడ్డగూడూరు మండలానికి చేరుకుంటుంది. ఈ మండలంలో తొలుత జానకీపురం నుంచి చిన్నపడిశాల, చిర్రగూడూరు, కోటమర్తి, ధర్మారం మీదుగా లక్ష్మీదేవికాల్వ వరకు ప్రవహిస్తుంది. అటు నుంచి సూర్యాపేట జిల్లాలోకి ప్రవేశిస్తుంది. కొద్దిరోజుల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు బిక్కేరు వాగు నుంచి నీళ్లు తీసుకొచ్చామంటూ గొప్పగా ప్రచారం చేసుకున్నారు. కొన్ని రోజుల పాటు అరకొరగా నీటిని వదిలినా పెద్దగా లాభం లేకపోయింది. ఇటీవల జలాలు రాకుండా ఎగువన గేట్లు మూసేయడంతో పరిసర గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయి.

### అన్నదాత పోరు బాట

బిక్కేరుకు జలాలను తరలించకపోవడంతో రైతులు పోరు బాట పడుతున్నారు. 10 రోజులపాటు నీళ్లు ఇస్తే మిగిలిన కొద్దిపాటి పంటలైనా చేతికి వస్తాయని చెప్తున్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు ఆందోళన బాట పట్టారు. ఇటీవల జానకీపురంలో ఎండిన వరి పొలంలో రైతులు మందు డబ్బాలతో నిరసన తెలిపారు. నీళ్లివ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. ప్రభుత్వం స్పందించి నీళ్లివ్వాలని కోరుతున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మందుల సామేల్ చొరవ చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

### తొలిసారి ఎండుతున్న పంటలు..

అడ్డగూడూరు మండలంలో రైతులు అధిక శాతం వరి సాగు చేశారు. ఈసారి ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. ఫలితంగా చెరువులు, చెక్ డ్యామ్‌లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. దాంతో బోర్లు పోయడం లేదు. పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి బోర్లు వేస్తున్నా నీళ్లు పడడం లేదు. గతంలో బిక్కేరు వాగు వెంట ఎప్పుడూ పంటలు ఎండిన దాఖలాలు లేవు. ఈసారి మాత్రం వాగు వెంబడి ఉన్న పొలాలు కూడా నీళ్లు చాలక ఎండిపోతున్నాయి. ఇప్పటికే వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దాంతో చాలామంది రైతులు పొలాల్లో బర్రెలు, గొర్రెలను మేపుతున్నారు. వారం రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే ఇంకా వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. బిక్కేరు వాగుకు నీళ్లిస్తే చెరువులు, చెక్ డ్యామ్‌లు జలకళను సంతరించుకుంటాయి. భూగర్భ జలాలు పెరిగి, బోర్లు పోసే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

### వారం రోజులు నీళ్లిస్తే పంట చేతికి వస్తుంది



మా ఊళ్లోనే బిక్కేరు వాగు వెంట నాకు రెండెకరాల పొలం ఉంది. మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని మొత్తం ఐదెకరాల్లో వరి సాగు చేస్తుంటాను. ఎన్నడూ సాగు నీటికి ఇబ్బందులు లేవు. ఈసారి నీటి ఎద్దడి కారణంగా మూడెకరాల పంట ఎండింది. మరో రెండెకరాలు చివరి దశలో ఉంది. ఇంకో వారంపాటు నీళ్లు ఇస్తే పంట చేతికి వస్తుంది. ప్రభుత్వం స్పందించి నీళ్లిచ్చి ఆదుకోవాలి.

*-బోనాల అశోక్, రైతు, జానకిపురం (అడ్డగూడూరు మండలం)*

### ఎండిన పంటకు పరిహారం ఇవ్వాలి



నేను మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి నాటు పెట్టాను. బిక్కేరు వాగులో నీళ్లు లేక పంటంతా ఎండిపోయింది. ఎకరం 40 వేల వరకు నష్టం జరిగింది. మూడెకరాలకు లక్షా 20 వేల వరకు నష్టపోయాను. ఎండిన పంటలకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

*– ననుబోతు సంపత్, రైతు, జానకిపురం (అడ్డగూడూరు మండలం)*

## సర్కారు దవాఖానలో మూడేండ్ల బాలుడి కిడ్నాప్

- నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన
- 24 గంటల్లో బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



బాలుడిని ఎత్తుకెళ్తున్న సీతారాములు

నీలగిరి, మార్చి 6 : నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో నాలుగేండ్ల బాలుడు కిడ్నాప్‌నకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. భిక్షాటన చేస్తూ జీవనం సాగించే అహ్మద్, షహమున్నీసా బేగం దంపతులు జనరల్ ఆస్పత్రి ఆవరణలోని షెడ్డులో మూడేండ్లుగా ఉంటున్నారు. వీరికి మూడేండ్ల కుమారుడు అబ్బు ఉన్నాడు. ఈ నెల 4న మధ్యాహ్నం నుంచి అబ్బు కనిపించడం లేదు. చుట్టుపక్కల వెతికినా దొరక్క పోవడంతో తల్లిదండ్రులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దవాఖాన ఆవరణలో సీసీ ఫుటేజీ పరిశీలించగా.. అబ్బును ఓ వ్యక్తి మాయమాటలు చెప్తూ, ఫోన్‌తో ఆడిస్తూ ఎత్తుకెళ్లడం గుర్తించారు. దాంతో రైల్వేస్టేషన్, బస్టాండ్ ఆవరణలో సీసీ ఫుటేజీలను పరిశీలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టిన పోలీసులు బాలుడు నకిరేకల్ ఉన్నట్లు గుర్తించారు. నార్కట్‌పల్లి మండలం మాండ్ర గ్రామానికి చెందిన కూలీ సీతారాములు సోదరి నకిరేకల్‌లో నివాసం ఉంటున్నది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. కొడుకు లేడని తరచూ బాధ పడుతుండడంతో ఒక బాబును కిడ్నాప్ చేసి ఆమెకు ఇవ్వాలని అనుకున్నాడు. ఈ నేపథ్యంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నివాసం ఉంటున్న అహ్మద్, షహమున్నీసా కుమారుడు అబ్బును ఎత్తుకెళ్లేందుకు పది రోజులపాటు రెక్కీ వేసి మంగళవారం కిడ్నాప్ చేసి తన సోదరికి ఇచ్చాడు. పోలీసులు గురువారం రాత్రి బాలుడిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. సీతరాములును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఫిర్యాదు అందిన 24గంటల్లో బాలుడిని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఓ కుటుంబం మూడేండ్లుగా ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉంటున్నా సిబ్బంది గుర్తించకపోవడం గమనార్హం.

## రాష్ట్రపతి భవన్‌లో చండూరు చేనేత స్టాల్



రాష్ట్రపతి భవన్‌లో చండూరు చేనేత కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్

చండూరు, మార్చి 6 : దేశ రాజధానిలోని రాష్ట్రపతి భవన్‌లో బుధవారం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రారంభించిన చేనేత కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శనలో స్టాల్స్ ఏర్పాటుకు తెలంగాణకు చెందిన 20 మంది చేనేత కళాకారులు ఎంపికయ్యారు. అందులో నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రానికి చెందిన జాతీయ అవార్డు గ్రహీత గంజి యాదగిరి, జాతీయ మెరిట్ అవార్డు గ్రహీత చిలుకూరు శ్రీనివాసులు ఉన్నారు. వీరు తమ నైపుణ్యంతో తయారు చేసిన చేనేత ఉత్పత్తులను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివరించారు. తమ ఉత్పత్తులను చూసి ప్రముఖులు మెచ్చుకున్నట్లు వారు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కళాకారులను ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో చేనేత హస్త కళలకు ప్రత్యేక స్థానం తీసుకొస్తామన్నారు. తెలంగాణ తరపున హస్తకళా ప్రదర్శనకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.